సాక్షి
మెదక్
మంగళవారం । 5 । నవంబర్ । 2024



ఎన్నాళ్లకెన్నాళ్లకు..

సంక్షేమ వసతి గృహాలు, గురుకుల విద్యార్థులకు ప్రభుత్వం దీపావళి కానుకగా డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచింది.

వివరాలు 8లో ▸



రైతుల క్షేత్రస్థాయి సందర్శన

జిల్లాలో ఆయిల్‌పామ్ తోటల సాగుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు.

వివరాలు 8లో ▸



ధాన్యం కొనేదెప్పుడో..?

అధికారులు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు కానీ ధాన్యం కొనుగోళ్లు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

7 నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ రాధాకిషన్ తదితరులు

మెదక్ కలెక్టరేట్: ఈనెల 7వ తేదీ నుంచి జిల్లాలో విద్యార్థులకు చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించనున్నట్లు డీఈఓ రాధాకిషన్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 7న పాఠశాలస్థాయి, 21న మండల, 28న జిల్లాస్థాయి సంబరాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోహన్‌రావు, దేవులా, ఏఎంఓ సుదర్శన్‌మూర్తి, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ ఎప్పుడూ?



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

కౌడిపల్లి(నర్సాపూర్): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పూర్తిస్థాయిలో రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం మహమ్మద్‌నగర్ సొసైటీ ప్రారంభోత్సవం అనంతరం విలేకరులతో మాట్లాడారు. రేషన్‌కార్డు లేనివారి జాబితా తయారు చేసినా ఇప్పటివరకు మాఫీ చేయకపోవడం సరికాదన్నారు. అలాగే రూ. 2 లక్షల పైన ఉన్న రైతులకు సైతం త్వరగా మాఫీ చేయాలని కోరారు. ధాన్యం కొనుగోళ్లు త్వరగా ప్రారంభించాలన్నారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ.. మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచ్‌లు సొంత ఖర్చులతో పనులు చేశారని గుర్తు చేశారు.

కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు



ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి, నాయకులు

తూప్రాన్: కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని మల్కాపూర్‌లో కొనుగోలు కేంద్రం వద్ద ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించి మాట్లాడారు. రైతుల పట్ల కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ హయంలో కేసీఆర్ అన్నివర్గాలకు న్యాయం చేశారని తెలిపారు. అనంతరం బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సత్యానారాయణ గౌడ్, మాజీ ఎంపీటీసీ సంతోష్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ కేంద్రాల్లోనే పత్తిని విక్రయించాలి

టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): రైతులు పండించిన పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఆత్మకూర్ రోడ్డులో గల వెంకటేశ్వర జిన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రైతులకు గిట్టుబాటు ధర అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం సీసీఐని రంగంలోకి దించిందని తెలిపారు. మద్దతు ధర క్వింటాలు రూ.7,521కు కొనుగోలు చేస్తుందన్నారు.



పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నిర్మలారెడ్డి

పదికి ప్రత్యేక బోధన



〉 పాపన్నపేట ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న ప్రత్యేక క్లాసులు

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పదో తరగతి ప్రత్యేక తరగతులు ప్రారంభం అయ్యాయి. వచ్చే మార్చిలో జరగనున్న పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు విద్యాశాఖ అధికారులు 58 రోజుల యాక్షన్ ప్లాన్ రూపొందించారు. ప్రతి రోజు సాయంత్రం 4.15 గంటల నుంచి 5.15 వరకు (గంట పాటు) నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. గతేడాది 92.90 శాతం ఉత్తీర్ణతతో జిల్లా రాష్ట్రస్థాయిలో 18వ స్థానంలో నిలిచింది.

- పాపన్నపేట(మెదక్)

58 రోజుల యాక్షన్ ప్లాన్ | వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం | జిల్లాలో 146 ఉన్నత పాఠశాలలు

మెదక్ జిల్లాలో మొత్తం 146 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. బాలురు 5,366 మంది, బాలికలు 5,549 కలిపి మొత్తం 10,915 విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వచ్చే మార్చిలో జరగనున్న పరీక్షలకు సంబంధించి ఈనెల 1వ తేదీ నుంచి వచ్చే ఏడాది జనవరి 11 వరకు 58 రోజుల యాక్షన్ ప్లాన్ రూపొందించారు. ఈ సమయంలో సిలబస్ పూర్తి చేసి రివిజన్ ప్రారంభించాలని సూచించారు. మొదటి రోజు సాంఘీకశాస్త్రం, రెండో రోజు హిందీ, మూడో రోజు గణితం, నాలుగోరోజు ఆంగ్లం, ఐదో రోజు ఫిజికల్ సైన్స్, ఆరో రోజు సోషల్, ఏడో రోజు బయోలజీ సబ్జెక్టులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు నిర్వహించిన ప్రత్యేక తరగతుల రికార్డు అందుబాటులో ఉంచాలి. సంబంధిత ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ వహించాలి. స్పెషల్ క్లాసులను ఆరుబయట కాకుండా తరగతి గదిలోనే నిర్వహించాలి. సిలబస్ పూర్తి కాగానే రివిజన్ చేయాలని అధికారులు ఆదేశించారు.

స్నాక్స్ ఇవ్వండి సారు



మిన్‌పూర్ నుంచి ఉదయం 8.30 గంటలకు కుర్తివాడ ఉన్నత పాఠశాలకు కాలినడకన బయలు దేరుతాం .స్పెషల్ క్లాస్ ముగించుకొని ఇంటికి తిరిగి వెళ్లే సరికి సాయంత్రం ఆరు అవుతుంది. రోజు ఆరు కిలోమీటర్లు నడవాలి. దీంతో సాయంత్రం పూట ఆకలి అవుతుంది. విద్యాశాఖ అధికారులు పది విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ ఇచ్చి ఆకలి బాధ తీర్చాలి.

– జంగం వర్ష, పదో తరగతి, కుర్తివాడ ఉన్నత పాఠశాల

మెరుగైన ఫలితాల కోసమే..



గతేడాది మార్చిలో జిల్లా నుంచి 10,283 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 9,553 మంది ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లా 18వ స్థానంలో నిలిచింది. ఈసారి మెరుగైన ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో ప్రత్యేక తరగతులు ప్రారంభించాం. స్నాక్స్ అందించే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతుల నిర్వహణలో నిర్లక్ష్యం చేయొద్దు.

– రాధాకిషన్, డీఈఓ మెదక్

పేదలకు మెరుగైన వైద్యం

- వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం ప్రారంభం



వైద్యులతో మాట్లాడుతున్న మంత్రి దామోదర, చిత్రంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఎంపీ రఘునందన్

నర్సాపూర్: పేదలకు మెరుగైన వైద్యం అందించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని, అందుకు అనుగుణంగా ప్రభుత్వ ఆస్పత్రులను తీర్చిదిద్దుతామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సోమవారం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఐదు పడకలతో కూడిన డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆస్పత్రిలో త్వరలో ఎన్‌సీడీ సెంటర్, ఎన్‌బిసీయూ సెంటర్లు, ట్రామా సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం ఎమర్జెన్సీ వార్డు ఏర్పాటు చేసేందుకు భూమి అందుబాటులో ఉందా..? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆస్పత్రి పక్కన భూమి ఉందని చెప్పారు. ఆ భూమిని పరిశీలించి ఆస్పత్రికి కేటాయించాలని మంత్రి కలెక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే సునీతారెడ్డి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శివదయాల్, డీఎంహెచ్‌ఓ శ్రీరాం, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సృజన, సూపరింటెండెంట్ డాక్టర్ పావని, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ భవనం ప్రారంభం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని మహమ్మద్‌నగర్ గేట్ వద్ద నూతనంగా నిర్మించిన పీఏసీఎస్ కార్యాలయ భవనాన్ని మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసి షిఫ్టింగ్ పద్ధతిలో తరగతులు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని.. వద్దని కోరుతూ విద్యార్థులు మంత్రికి వినతి పత్రం అందజేశారు.

గ్రంథాలయాల పాత్ర కీలకం



సుహాసినిరెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న మంత్రి దామోదర

మెదక్‌జోన్: సమాజాన్ని విద్యాపరంగా చైతన్య పర్చడంలో గ్రంథాలయాల పాత్ర కీలకమని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సోమవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ అభివృద్ధికి తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. రైస్ మిల్లర్లు అండర్ టేకింగ్ త్వరితగతిన పూర్తిచేసి ధాన్యం దిగుమతి చేసుకోవాలని సూచించారు. లక్షన్నర మెట్రిక్ టన్నుల ధాన్యం జిల్లాలో దిగుమతి సాధ్యం కాదని, బయటి జిల్లాలకు పంపించేలా చర్యలు తీసుకోవాలని అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా.. చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వంశీకృష్ణ పాల్గొన్నారు.

ప్రజావాణికి 59 వినతులు



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

మెదక్ కలెక్టరేట్: ప్రజావాణికి వినతులు వెల్లువెత్తాయి. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి 59 వినతులు రాగా.. అందులో ధరణి (20), రుణమాఫీ (10), డబుల్‌బెడ్రూం (3)తో పాటు ఇతర సమస్యలపై మరో 26 అర్జీలు వచ్చాయి. వాటిని పరిశీలించిన అదనపు కలెక్టర్ తక్షణం పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అనేక సమస్యలు నెలకొన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని మెదక్ పట్టణానికి చెందిన చౌదరి యాదగిరి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. రోగులకు సరిగా మందులు ఇవ్వడం లేదని, బాత్రూంలకు తలుపు లేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ల్యాబ్‌లో పనిచేసే సిబ్బందికి కనీసం పేర్లు చదవడం, రాయడం కూడా రావడం లేదని చెప్పారు.

ధాన్యం కొనాలని ఆందోళన



కొర్విపల్లిలో రాస్తారోకో చేస్తున్న రైతులు

చిన్నశంకరంపేట(మెదక్): ధాన్యం కొనుగోలు చేయాలంటూ మండలంలోని కొర్విపల్లి రైతులు ఆందోళనకు దిగారు. సోమవారం గ్రామంలోని మెదక్– చేగుంట ప్రధాన రహదారిపై ధాన్యం పోసి నిరసన చేపట్టారు. 20 రోజుల క్రితం కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చామని, కాంటా పెట్టాలని కోరుతున్నా నిర్వాహకులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి కొనుగోలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సుమారు గంటకుపైగా ధర్నా కొనసాగింది. పోలీసులు రైతులను సముదాయించారు.

రైతులు ఆందోళన చెందొద్దు

- మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

చిన్నశంకరంపేట(మెదక్): రైస్‌మిల్లర్ల సమస్యను పరిష్కరించి ఒకటి, రెండు రోజుల్లో ధాన్యం కాంటా చేస్తామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. సోమవారం నార్సింగి మండలం సంకాపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని కోరారు. జిల్లాలో 475 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ కరీం, ఎంపీడీఓ ఆనంద్, ఐకేపీ ఏపీఎం అశోక్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, నార్సింగి, చిన్నశంకరంపేట మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు సత్యనారాయణ, శ్రీనివాస్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత జిల్లాయే లక్ష్యం: ఎస్పీ

మెదక్ మున్సిపాలిటీ: డ్రగ్స్ రహిత జిల్లాయే ప్రధాన లక్ష్యమని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అధికారులు, సిబ్బంది వాహనాలు తనిఖీ నిర్వహించే సమయంలో అనుమానం ఉన్న వ్యక్తులను నార్కోటిక్ డ్రగ్స్ కిట్స్ ద్వారా పరిశీలించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా గుర్తించిన బ్లాక్ స్పాట్లలో తనిఖీలు నిర్వహించినప్పుడు తప్పకుండా వీటిని ఉపయోగించాలన్నారు. పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలన్నారు. మాదకద్రవ్యాల విషయంలో ఎంత పెద్ద వారు ఉన్న ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. డ్రగ్ రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.



నార్కోటిక్ డ్రగ్స్ కిట్‌ను పంపిణీ చేస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

కార్యక్రమంలో డీసీఆర్బీ సీఐ మధుసూదన్‌గౌడ్, కానిస్టేబుల్ నాగరాజు పాల్గొన్నారు.

ప్రతీ గింజను కొంటాం

- ఉమ్మడి మెదక్ జిల్లా స్పెషల్ ఆఫీసర్ హరిచందన



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న హరిచందన

నర్సాపూర్/కౌడిపల్లి(నర్సాపూర్): రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, అందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని ఉమ్మడి మెదక్ జిల్లా స్పెషల్ ఆఫీసర్ హరిచందన అన్నారు. సోమవారం రాత్రి ఆర్డీఓ కార్యాలయంలో మెదక్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు తమ ధాన్యాన్ని ఎండబెట్టి తీసుకురావాలని సూచించారు. తూకం వేసే పనులు వేగవంతం చేసేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటారని అన్నారు. ఏమైనా సమస్యలు ఎదురైతే రైతులు హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి చెప్పాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు రైస్ మిల్లులను కేటాయించామన్నారు. తూకం వేయగానే ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తారని, అందుకు తగిన ఏర్పాట్లు చేశామని వివరించారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో కొనుగోలు ప్రక్రియ సక్రమంగా కొనసాగేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో మెదక్ అదనపు కలెక్టర్ నగేష్, సంగారెడ్డి అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీఓ మహిపాల్, తహసీల్దార్ శ్రీనివాస్, వ్యవసాయ శాఖ, సివిల్ సప్లై శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం కౌడిపల్లి మండలంలోని నాగ్సాన్‌పల్లి వద్ద డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా తేమశాతం పరిశీలించి రైతులతో మాట్లాడారు. నాణ్యమైన ధాన్యం సేకరించాలని నిర్వాహకులకు సూచించారు.

నిఘా నేత్రాలు.. నిరంతర పర్యవేక్షణ

- సమర్థవంతమైన పాలనకు సమూల మార్పులు
- ప్రతి కార్యాలయంలో సీసీ కెమెరా ఏర్పాటు



〉 మెదక్ సమీకృత కలెక్టరేట్

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని అన్నిశాఖల అధికారులు సక్రమంగా విధులు నిర్వర్తించి ప్రజలకు సేవలందించాలని కలెక్టర్ పదే పదే ఆదేశాలు జారీ చేస్తున్నా... కొందరిలో మార్పు రావడం లేదు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. వీటిపై స్పందించిన కలెక్టర్ రాహుల్‌రాజ్ జిల్లాలో అధికారుల పాలనపై సమూల మార్పులు తెచ్చేందుకు పటిష్ట చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రులతో పాటు కలెక్టరేట్‌లోని ప్రతి కార్యాలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు.

160 సీసీ కెమెరాలు

కలెక్టరేట్‌తో పాటు జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏకంగా 160 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటి పర్యవేక్షణకు కలెక్టరేట్‌లో సర్వేలైన్స్ కంట్రోల్ రూం సిద్ధం చేశారు. కలెక్టర్ తన ఛాంబర్ నుంచి అధికారుల పనితీరును పర్యవేక్షిస్తున్నారు. ఏ ఒక్క అధికారి విధుల్లో అలసత్వం వహించిన సహించేది లేదని హెచ్చరికలు జారీ చేశారు.

ఆ అధికారులు ఇంటికే...

అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమయపాలన లేకుండా కార్యాలయానికి వస్తామంటే కుదరదు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాల్సిందే. లేదంటే నిఘా నేత్రాలు గుట్టును రట్టు చేస్తాయి. దీంతో అలాంటి అధికారులపై కలెక్టర్ తక్షణ చర్యలు చేపట్టనున్నారు. అలాగే కలెక్టరేట్‌లో ప్రతి కదలిక సీసీటీవీ సర్వేలైన్స్‌లో ఉంటుంది. సీసీ కెమెరాల ఏర్పాటుతో అధికారులు, సిబ్బంది పనితీరు సైతం అంచనా వేయవచ్చు. అలాగే కార్యాలయాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా పగడ్బందీ చర్యలు తీసుకునేందుకు వీలు ఉంటుంది.

ఇప్పటికే ఈ– ఆఫీస్ విధానం

ఇప్పటికే కలెక్టరేట్‌లోని అన్నిశాఖల అధికారులు తమ ఫైళ్లను కేవలం ఈ– ఆఫీస్ విధానం ద్వారానే పంపాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ప్రస్తుతం ఈ–ఆఫీస్ విధానం ద్వారానే ఫైళ్లను కలెక్టర్ పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో దాదాపు 40కిపైగా శాఖల్లో జిల్లా అధికారులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇందులో కొన్నిశాఖల అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాటు పలు పనుల మీద వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండటం లేదన్న ఫిర్యాదులు వచ్చాయి. దీంతో అధికారుల పనితీరుపై పక్కాగా పర్యవేక్షణ ఉండేలా కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.



సీసీ కెమెరా సర్వేలైన్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్ (ఫైల్)

క్లుప్తంగా

ఉద్యాన రంగంలో ఉజ్వల భవిష్యత్‌ : రాజిరెడ్డి

ములుగు(గజ్వేల్‌): విద్యార్థులకు, నిపుణులకు ఉద్యాన రంగంలో ఉజ్వల భవిష్యత్‌ ఉంటుందని ములుగు ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్‌ చాన్స్‌లర్‌ డాక్టర్‌. దండా.రాజిరెడ్డి అన్నారు. ములుగు యూనివర్సిటీలో ఉద్యాన రంగంపై అధికారులతో సోమవారం ఆయన మాట్లాడారు. రోజురోజుకూ పెరుగుతున్న ఉద్యాన పంటల విస్తీర్ణం నేపథ్యంలో విద్యార్థులకు పుష్కలమైన ఉపాధి అవకాశాలున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్షల ఎకరాల పామ్‌ ఆయిల్‌ తోటల విస్తీర్ణం పెరుగుతున్న నేపథ్యంలో నర్సరీలు, పామాయిల్‌ తోటల నిర్వహణ, పామాయిల్‌ పరిశ్రమలకు వందలాది ఉద్యాన విద్యార్థులను నియమించుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఉద్యాన పంటల ఆధారిత అంకుర సంస్థలు, స్టార్ట్‌ యాప్స్‌ భారీగా మార్కెట్లో ఉన్నాయని స్వయం ఉపాధికి దోహదం చేస్తున్నాయన్నారు. వీటి స్థాపనకు ఉద్యాన విద్యల్లో డిగ్రీ, పీజీ పూర్తి చేసిన విద్యార్థులు విజయవంతంగా ముందుకు వెళ్తున్నారని తెలిపారు.

నేడు ఉమ్మడి జిల్లా స్థాయి నెట్‌ బాల్‌ పోటీలు

గజ్వేల్‌రూరల్‌: ఉమ్మడి మెదక్‌ జిల్లా నెట్‌బాల్‌ పోటీలకు సబ్‌ జూనియర్‌ బాలబాలికల విభాగంలో క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు నెట్‌బాల్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు డానియల్‌, ఉపాధ్యక్షులు విజయరేఖ, సెక్రటరీ రంజిత్‌కుమార్‌ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ప్రజ్ఞాపూర్‌లోని జిల్లా పరిషత్‌ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగే క్రీడాకారుల ఎంపికకు ఉదయం 9 గంటలలోగా ఆధార్‌కార్డుతో క్రీడాకారులు హాజరు కావాలని సూచించారు. ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు 8 నుంచి 10 వరకు నిర్మల్‌ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి నెట్‌బాల్‌ పోటీల్లో పాల్గొంటారని, మరిన్ని వివరాలకు 97046 11361 నంబరులో సంప్రదించాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు..



విద్యార్థులతో ఉపాధ్యాయులు

కొండాపూర్‌(సంగారెడ్డి): మండల పరిధిలోని గంగారం విద్యార్థులు రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పండరినాయక్‌ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను సోమవారం పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు. అనంతరం పండరినాయక్‌ మాట్లాడుతూ.. 2వ తేదీన సిద్దిపేటలో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో అండర్‌ -17 విభాగంలో గంగారం పాఠశాల విద్యార్థులు సుమతి, లక్ష్మీ, వర్షిత, అదే విధంగా అండర్‌ -14 విభాగంలో పవిత్ర, ప్రవళిక రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు 8,9,10వ తేదీల్లో వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఉపాధ్యాయ బృందంతో పాటు అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్‌ కళావతి, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

కమర్షియల్‌ పైలెట్‌గా యశశ్విని ఎంపిక



పైలెట్‌ శిక్షణలో యశశ్విని

గజ్వేల్‌రూరల్‌: ఇండిగో ఎయిర్‌ లైన్స్‌లో కమర్షియల్‌ పైలెట్‌గా ఎంపికైన యువతి అందరి మన్ననలు అందుకుంటుంది. వివరాల్లోకి వెళ్తే.. గజ్వేల్‌ మండలం దాచారానికి చెందిన వేముల మురళీ–వసుంధర దంపతులకు కొడుకు, కూతురు యశ్విని(నేహా) ఉన్నారు. ఇటీవలె యశశ్విని మహారాష్ట్రలోని పూణేలో పైలెట్‌గా శిక్షణ పొంది ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో అన్ని దశల ఇంటర్వ్యూలను దాటుకొని కమర్షియల్‌ పైలెట్‌గా ఉద్యోగం సాధించింది. ఈ సందర్భంగా సోమవారం గ్రామస్తులు, పలువురు అభినందించారు. తండ్రి మురళీ రామాయంపేటలోని ఎస్‌బీలో హెడ్‌ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తుండగా, తల్లి వసుంధర కామారెడ్డి జిల్లాలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుంది.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

డైట్‌, కాస్మోటిక్‌ చార్జీలు పెంచిన ప్రభుత్వం



సీఎం, డిప్యూటీ సీఎంలకు కృతజ్ఞతలు చెబుతూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



భోజనం చేస్తున్న విద్యార్థులు

- వసతి గృహాలు, గురుకుల విద్యార్థులకు లబ్ధి
- జిల్లా వ్యాప్తంగా 27,184 మంది
- 40 శాతం పెరిగిన ధరలు
- విద్యార్థులకు తీరనున్న ఇబ్బందులు

జహీరాబాద్‌: సంక్షేమ వసతి గృహాలు, గురుకుల విద్యాసంస్థల్లోని విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం దీపావళి కానుకగా డైట్‌ చార్జీలు, కాస్మోటిక్‌ చార్జీలను పెంచింది. చాలీచాలని చార్జీలతో వసతి గృహంలో నెట్టుకొస్తున్న విద్యార్థులకు ఎట్టకేలకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. దీంతో విద్యార్థుల రోజువారి డైట్‌ మెనూ మారింది. ఇక నుంచి రోజువారీగా కోడిగుడ్లు, పండ్లు మెనూలో చేరాయి. నవబంబర్‌ 1వ తేదీ నుంచి పెరిగిన చార్జీలు అమల్లోకి వచ్చాయి. విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు, పాఠశాలల సిబ్బంది ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సంగారెడ్డి జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో 3 నుంచి పీజీ వరకు ఉంటున్న 9,350 మంది విద్యార్థులకు, గురుకులాల్లో ఉంటున్న 17,834 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరింది. అధికారుల కమిటీ అధ్యయనం చేసి ఇచ్చిన నివేదికలను పరిగణలోకి తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం మేర ధరలను పెంచింది. బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ ఆయా శాఖల సంక్షేమ శాఖలతో కమిటీల సహకారంతో అధ్యయనం చేసి అందించిన నివేదికలను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వం ఆయా చార్జీలను పెంచింది. గతంలో వారానికి మూడు రోజులపాటు గుడ్లు ఇచ్చేది. ఇక నుంచి ప్రతీ నిత్యం గుడ్లను అందించనుంది. చికెన్‌ వారంలో ఒక రోజు ఇస్తుండగా దీన్ని రెండు రోజులకు పెంచారు. పండ్లు కొత్తగా మెనూలో చేర్చారు. వారానికి ఆరు రోజులు పండ్లు విద్యార్థులకు అందిస్తారు. 17 ఏళ్ల అనంతరం డైట్‌, మెస్‌ చార్జీలు పెంచడం జరిగిందని ప్రభుత్వం పేర్కొంది.

కాస్మోటిక్‌ చార్జీలు (రూపాయల్లో..)		
విద్యార్థినీలకు ఇలా..		
3 నుంచి 7 వరకు	55	175
8 నుంచి 10 వరకు	75	275
విద్యార్థులకు ఇలా..		
3 నుంచి 7వరకు	62	150
8 నుంచి 10వరకు	62	200

సంతోషంగా ఉంది



ఇప్పటి వరకు ప్రభుత్వం ఇచ్చిన డైట్‌, కాస్మోటిక్‌ చార్జీలు ఏ మాత్రం సరిపోయేది కాదు. మెనూ కూడా అమలు చేయడంలో ఇబ్బందులు వచ్చేవి. దీంతో ఉన్న నిధులతోనే సరిపెట్టేవారు. ప్రభుత్వం చార్జీలు పెంచడం సంతోషంగా ఉంది. దీంతో కడుపునిండా తిండి లభిస్తుంది.

– జి.సందీప్‌ డిగ్రీ విద్యార్థి, జహీరాబాద్‌

	తరగతి	ప్రస్తుతం	పెంచినవి
డైట్‌ చార్జీలు	3 నుంచి 7 వరకు	రూ.950	రూ.1,330
	8 నుంచి 10 వరకు	1,100	1,540
	ఇంటర్‌, డిగ్రీ, పీజీ	1,500	2,100

సొసైటీ	సం.హాస్టళ్లు	విద్యార్థులు
ఎస్సీ	48	4,100
ఎస్టీ	13	2,150
బీసీ	35	3,100

సొసైటీ	గురుకులాలు	విద్యార్థులు
ఎస్సీ	13	7,800
ఎస్టీ	09	3,800
బీసీ	12	6,234

పేదింటి బిడ్డకు పెద్ద కష్టం

- కాలేయ వ్యాధితో బాధపడుతున్న నాలుగేళ్ల చిన్నారి
- వైద్యానికి రూ.35 లక్షలు ఖర్చు
- దాతల సాయం కోసం ఎదురుచూపులు



ఆస్పత్రిలో చిన్నారి రియాన్షిక

కోహెడరూరల్‌(హుస్నాబాద్‌): ఆడుకోవాల్సిన వయస్సులో ఆ చిన్నారికి పెద్ద కష్టం వచ్చిపడింది. వివరాల్లోకి వెళ్తే.. కోహెడ మండలంలోని శ్రీరాములపల్లికి చెందిన పున్నం రాజశేఖర్‌, శిరీష దంపతుల నాలుగేళ్ల కూతురు రియాన్షిక రెండు నెలలుగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. గతంలో చికిత్స కోసం బంగారం అమ్మి, అప్పులు చేసి రూ.8 లక్షలు ఖర్చు చేశారు. అయినా తగ్గకపోవడంతో డాక్టర్స్‌ చిన్నారికి కాలేయ మార్పిడి చేయాలని సూచించారు. దీనికి దాదాపు రూ.35 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. కాయాకష్టం చేసుకొని బతికే వారికి అంత ఖర్చు చేసే స్తోమత లేకపోవడంతో దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. దాతలు, ప్రభుత్వం స్పందించి తమ బిడ్డను ఆదుకోవాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. సహాయం అందించాలనుకునే వారు చిన్నారి బంధువులు పోల్‌ శ్రీనివాస్‌ ఫోన్‌ పే నంబర్‌ 9848924347, బండిపెల్లి శ్రీకాంత్‌ గూగుల్‌ పే నంబర్‌ 9666338616 కు చేయగలరు.

‘ఆయిల్‌ పామ్‌’పై క్షేత్రస్థాయి సందర్శన



అశ్వరావుపేట ఆయిల్‌ ఫెడ్‌ ఫ్యాక్టరీ సందర్శనలో రైతులు

- జిల్లాలో 100 మంది రైతులతో ఉద్యానవన టూర్‌

మెదక్‌ కలెక్టరేట్‌: జిల్లాలో ఆయిల్‌పామ్‌ తోటల సాగుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. సాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఉద్యానవన శాఖ అధికారులు కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేటలో గల ఆయిల్‌ పామ్‌ తోటల క్షేత్ర స్థాయి సందర్శనతోపాటు ఆయిల్‌ ఫెడ్‌ ఫ్యాక్టరీ సందర్శించడానికి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్‌సింగ్‌ మాట్లాడుతూ.. ఈ సందర్శనకు ఆయిల్‌ పామ్‌ సాగు చేయాలనుకునే సుమారు 100 మంది రైతులను లివ్‌ పామ్‌ రిసోర్సెస్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ ఆధ్వర్యంలో తరలించినట్లు తెలిపారు. ఆయిల్‌పామ్‌ తోటలో అంతర పంటలుగా వక్క, కోకో, జాజికాయ, అరటి మొదలైన పంటలు వేసుకోవచ్చని తెలిపారు. తద్వారా రైతులు ఆయిల్‌పామ్‌ సాగుతోపాటు పండ్ల తోటల పెంపకంతో అధిక లాభాలు పొందవచ్చన్నారు. అనంతరం తోటలను సాగు చేస్తున్న రైతులతో సాగు నిర్వహణ, చీడపీడల బెడద, పంట రవాణా, అంతర పంటల సాగు వంటి అంశాలు నేరుగా స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే అశ్వరావుపేటలోని తెలంగాణ రాష్ట్ర నూనె గింజల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య, లిమిటెడ్‌ ఆయిల్‌పామ్‌ కర్మాగారాన్ని సందర్శించారు. లివ్‌ పామ్‌ రిసోర్సెస్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ ప్రాజెక్ట్‌ మేనేజర్‌ కృష్ణ, ఫీల్డ్‌ ఆఫీసర్స్‌, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్‌ 3 పరీక్షకు ఏర్పాట్లు చేయాలి

- అదనపు కలెక్టర్‌ అబ్దుల్‌ హమీద్‌
- జిల్లా అధికారులతో సమావేశం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ అబ్దుల్‌ హమీద్‌

సిద్దిపేటరూరల్‌: గ్రూప్‌ 3 పరీక్షను నిర్వహించేందుకు గాను జిల్లాలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్‌ అబ్దుల్‌ హమీద్‌ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్‌ హాల్‌లో పరీక్ష నిర్వహణకు సంబంధించి చీఫ్‌ సూపరింటెండెంట్‌, డిపార్ట్‌మెంట్‌ ఆఫీసర్‌, రూట్‌ ఆఫీసర్లు, ఫ్లయింగ్‌ స్క్వాడ్‌, పోలీస్‌ అధికారులతో అదనపు కలెక్టర్‌ సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లా రీజినల్‌ కో ఆర్డినేటర్‌ వీపీ రాజు పవర్‌ పాయింట్‌ ప్రజెంటేషన్‌ ద్వారా పరీక్ష నిర్వహణ గురించి క్లుప్తంగా వివరించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్‌ మాట్లాడుతూ.. జిల్లాలో 37 సెంటర్లలో 13,408 మంది అభ్యర్థులు గ్రూప్‌ 3 పరీక్ష రాయనున్నారని తెలిపారు. జిల్లా కేంద్రంలో 4 రూట్లకు గాను కేటాయించిన అధికారులు ఒక రోజు ముందే కేంద్రాన్ని చూసుకోవాలన్నారు. పరీక్ష రోజు స్ట్రాంగ్‌ రూమ్‌ నుంచి పరీక్ష పత్రాలను సెంటర్లకు చేర్చడానికి పోలీస్‌ ఎస్కార్ట్‌ సహాయం పొందాలన్నారు.

దొడ్డురకం వడ్లకూ బోనస్‌ ఇవ్వాలి

- ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి

మర్కూక్‌(గజ్వేల్‌): సన్నరకం వడ్లకు రూ.500 బోనస్‌ ఇస్తామని ప్రభుత్వం చెప్పిన మాటకు కట్టుబడి ఉండాలని, రాబోయే రోజుల్లో దొడ్డు రకం వడ్లకు కూడా బోనస్‌ ఇవ్వాలని ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి డిమాండ్‌ చేశారు. సోమవారం మండలంలోని వర్దరాజ్‌పూర్‌, చేబర్తి గ్రామాల్లో సహకార సంఘం ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో వడ్లు కొనుగోలు చేసి మద్దతు ధర కల్పించిందన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వంకూడా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో జగదేవ్‌పూర్‌ పీఏసీఎస్‌ చైర్మన్‌ ఇంద్రసేనారెడ్డి, మాజీ జెడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం యాదవ్‌, మాజీ వైస్‌ ఎంపీపీ బాల్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి నాగేందర్‌ రెడ్డి, కాంగ్రెస్‌ మండల ఉపాధ్యక్షుడు యాదగిరి, మాజీ సర్పంచ్‌లు మాధవి రాజిరెడ్డి, అశోక్‌, గ్రామ కార్యదర్శులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తాను వేసిన వల కాళ్లకు చుట్టుకొని..

- చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



రమేశ్‌(ఫైల్‌)

నర్సాపూర్‌ రూరల్‌: చేపల వేటకు వెళ్లి వ్యక్తి మతి చెందిన ఘటన నర్సాపూర్‌ మండలం నారాయణపూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. నర్సాపూర్‌ ఎస్సై లింగం కథనం మేరకు.. గ్రామానికి చెందిన రోటం రమేశ్‌(33) గ్రామ సమీపంలోని దోసల్‌ చెరువుకు చేపలు పట్టేందుకు వెళ్లాడు. తాను వేసిన వల కాలుకు చుట్టుకొని నీటిలో మునిగి ఊపిరాడక మృతి చెందాడు. గ్రామస్తులు గమనించి రమేశ్‌ మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింగం తెలిపారు.

కిరాణ సామగ్రికి వెళ్తొస్తుండగా..

కొండపాక(గజ్వేల్‌): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన దుద్దెడ గ్రామ శివారులో చోటు చేసుకుంది. సోమవారం సిద్దిపేట త్రీ టౌన్‌ పోలీసుల కథనం మేరకు.. అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని ఎనగుర్తి గ్రామానికి చెందిన ముచ్చన పల్లి స్వామి (35) దుద్దెడ గ్రామ శివారులోని పూజ పౌల్ట్రీ ఫామ్‌లో కూలీ పనులు చేసుకుంటూ భార్య సుమలత, నలుగురు పిల్లలను పోషించుకుంటున్నాడు. కిరాణ సామగ్రి తీసుకురావడానికి దుద్దెడ గ్రామానికి వెళ్లాడు. తిరిగొస్తుండగా పెట్రోల్‌ పంపు వద్ద హైదరాబాద్‌ నుంచి కరీంనగర్‌ వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. తీవ్ర గాయాలైన స్వామిని సిద్దిపేట జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన రామచంద్రాపురం పట్టణంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అమీన్‌పూర్‌ మండలం కిష్టారెడ్డిపేటకు చెందిన వేణుగోపాల్‌(40) ఆదివారం అర్ధరాత్రి బీరంగూడ నుంచి పటాన్‌చెరు వైపు బైక్‌పై వెళ్తున్నాడు. రామచంద్రాపురం గాంధీ విగ్రహం సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాలైన అతడిని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటో బోల్తాపడి..



ప్రమాదస్థలంలో గాయాలతో ఫిరోజ్‌

జహీరాబాద్‌ టౌన్‌: ఆటో బోల్తా పడిన ఘటనలో తీవ్రంగా గాయపడిన డ్రైవర్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని హోతి(బి) గ్రామానికి చెందిన షేక్‌ ఫిరోజ్‌(37) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం మండలంలోని బూచినెల్లి గ్రామానికి వెళ్తుండగా ఆటో బోల్తా పడింది. తీవ్రగాయాలైన ఫిరోజ్‌ను జహీరాబాద్‌లోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషయమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. చిరాగ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు హోతి(బి)గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, నాయకులు, తదితరులు ఉన్నారు.

కుమారుడు మృతి చెందాడని దిగులుతో.

ఉరేసుకొని తండ్రి ఆత్మహత్య

చేగుంట(తూప్రాన్‌): జీవితంపై విరక్తి చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మాసాయిపేటలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. స్టేషన్‌ మాసాయిపేట గ్రామానికి చెందిన మండె మనోహర్‌(60) కుమారుడు రాకేశ్‌ రెండేళ్ల కిందట ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడిని తలచుకొని మనోహర్‌ నిత్యం బాధ పడుతుండేవాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది గ్రామంలోని ఓ ఫంక్షన్‌ హాల్‌లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య కస్తూరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి..

చిన్నకోడూరు(సిద్దిపేట): పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ బాలకృష్ణ కథనం మేరకు.. చిన్నకోడూరు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని మాటిండ్ల గ్రామానికి చెందిన పొన్నాల స్వామి(22) కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక గత నెల 30న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు బాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉరేసుకొని కారు డ్రైవర్‌

దుబ్బాకటౌన్‌: ఉరేసుకొని కారు డ్రైవర్‌ ఆత్మహత్యకు పాల్పడాడు. ఈ ఘటన దుబ్బాక మున్సిపల్‌ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. లచ్చపేట 12 వార్డుకు చెందిన ఆస నర్సయ్య కూలీ పనులు చేస్తూ, భార్య రాజమణి, ఇద్దరు కుమారులతో జీవనం సాగిస్తున్నాడు. 2వ కుమారుడు ఆస నాగరాజు (29) హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పని చేస్తూ 8 నెలల కిందట వివాహం చేసుకొని, భార్యతో అక్కడే ఉంటున్నాడు. ఇటీవల దీపావళి పండుగకు భార్యతో కలిసి స్వగ్రామానికి వచ్చాడు. సోమవారం ఇంటి సమీపంలోని చెట్టుకు నాగరాజు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై దుబ్బాక పోలీసులను వివరణ కోరగా ఇంకా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ప్రతీ ఆరు నెలలకు టీకా వేయించాలి

- పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్‌ శ్రీలక్ష్మి



పశువులకు టీకా వేస్తున్న శ్రీలక్ష్మి

గజ్వేల్‌రూరల్‌: పశువులలో గాలికుంటు వ్యాధి ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్‌, ముఖ్య పర్యవేక్షణాధికారి డాక్టర్‌ శ్రీ లక్ష్మి సూచించారు. మండల పరిధిలోని కొడకండ్లలో కొనసాగుతున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమంలో సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణ కోసం టీకాలను వేయడం జరుగుతుందని, నెల రోజులపాటు వేయనున్నట్లు తెలిపారు. ఈ వ్యాధికి చికిత్స లేదని, దీనిని దృష్టిలో పెట్టుకొని ముందు జాగ్రత్తగా ప్రతీ 6 నెలలకోసారి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని సూచించారు. కొడకండ్లలో 159 పశువులకు టీకాలు వేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో గజ్వేల్‌ పశువైద్యాధికారి డాక్టర్‌ రమేశ్‌ బాబు, సింగాటం పశువైద్యాధికారి డాక్టర్‌ విజయ లక్ష్మీ, వైద్యసిబ్బంది కొండల్‌రెడ్డి, రమేశ్‌ బాబు, సంజీవ్‌, కిరణ్‌, శంకర్‌లతోపాటు గోపాలమిత్రలు పాల్గొన్నారు.

సరస్వతీ పుత్రికలకు బాసట

- "డాక్టర్‌.. డాటర్స్‌" కథనానికి స్పందన
- పలువురు రూ.4.20 లక్షల ఆర్థిక సాయం అందజేత

సాక్షి ఎఫెక్ట్‌



విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న డాక్టర్‌ దేవేందర్‌

సిద్దిపేటకమాన్‌: ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఒకే ఇంట్లో ఏకంగా నలుగురు కూతుళ్లు ఎంబీబీఎస్‌ సీట్లు సాధించి డాక్టర్లు కావడం విశేషం. ఇదే విషయాన్ని ''డాక్టర్‌.. డాటర్స్‌'' శీర్షికతో సాక్షి ఫ్యామిలీ పేజీలో గత నెల 12వ తేదీన ప్రచురించగా విశేష స్పందన లభించింది. పట్టణానికి చెందిన ప్రముఖ హోమియోపతి వైద్యుడు డాక్టర్‌ వల్లకోటి దేవేందర్‌, వద్దెపల్లి కుటుంబాలు విద్యార్థులకు రూ.40,116 ఆర్థిక సాయం సోమవారం అందజేశారు. అలాగే వైద్యుల తండ్రి కొంక రామచంద్రం (శేఖర్‌) తో ఫోన్‌లో మాట్లాడి అతడి ఆర్థిక పరిస్థితి తెలుసుకొని పిల్లల చదువు నిమిత్తం వివిధ ప్రాంతాల (తెలంగాణ, ఆంధ్రా) నుంచి పలువురు ఇప్పటి వరకు మొత్తం రూ.4.20లక్షల అందజేశారు. సిద్దిపేట పట్టణం నర్సాపూర్‌కు చెందిన కొంక రామచంద్రం, శారద దంపతులకు నలుగురు కుమార్తెలు. రామచంద్రం శారద టైలరింగ్‌ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. తమ నలుగురు కుమార్తెలు డాక్టర్లు కావడమే విశేషం. పెద్ద కూతురు మమత ఎంబీబీఎస్‌ పూర్తి చేయగా, రెండో కూతురు ఎంబీబీఎస్‌ ఫైనల్‌ ఇయర్‌ చదువుతుండగా, మరో ఇద్దరు కూతుళ్లు ఈ ఏడాది మెడిసిన్‌లో సీట్లు సాధించిన విషయం తెలిసిందే. ''సాక్షి''లో ప్రచురితమైన కథనం, రామచంద్రం ఫోన్‌ నెంబర్‌ ద్వారా పలువురు అతడిని అభినందించడంతో పాటు ఆర్థిక సాయం చేసినట్లు తెలిపారు. దీంతో రామచంద్రం ''సాక్షి''కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్‌ రజనీష్‌, నాగమణి, పునర్వసు, వడ్డెపల్లి చిరంజీవులు, విమల పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే..

- ‘సాక్షి’ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పెల్‌బీ పరీక్ష



సిద్దిపేటలో స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సిద్దిపేటజోన్‌/చేర్యాల(సిద్దిపేట): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ‘సాక్షి స్పెల్‌బీ’ పరీక్ష ఎంతగానో దోహదపడుతుందని సిద్దిపేట అంబిటాస్‌ స్కూల్‌ ప్రిన్సిపాల్‌ జ్యోతి, చేర్యాల వికాస్‌ గ్రామర్‌ స్కూల్‌ ప్రిన్సిపాల్‌ ఎలియాస్‌ అన్నారు. సాక్షి ఆధ్వర్యంలో సోమవారం ‘స్పెల్‌ బీ’ ఆంగ్లం ప్రాథమిక స్థాయి పరీక్షను తదితర పాఠశాలల్లో నిర్వహించారు. పరీక్షకి చేర్యాల స్కూల్‌ నుంచి 3, 4వ తరగతులు చదువుతున్న 28 మంది విద్యార్థులు హాజరై తమ ప్రతిభను పరీక్షించుకున్నారు. అలాగే సిద్దిపేట అంబిటాస్‌ పాఠశాలకు చెందిన 48 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపాల్‌ విజయ భాస్కర్‌, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ‘సాక్షి’తో విద్యార్థులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

పరీక్షలు అంటే భయం పోతుంది



సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్‌ బీ పోటీ పరీక్షల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది. ఇలాంటి వాటిలో పాల్గొంటే పరీక్షలు అనే ఒక భయం పోతుంది. ప్రతీ పరీక్షను సులువుగా రాసేందుకు అవకాశం ఉంటుంది.

– సహజ, ఏడవ తరగతి, అంబిటాస్‌

జిల్లా స్థాయి పోటీల కోసం ప్రయత్నిస్తా..



సాక్షి ప్రాథమిక స్థాయి స్పెల్‌బీ పోటీ పరీక్షల్లో పాల్గొన్న అనుభవంతో జిల్లా స్థాయిలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తా. సాక్షి దినపత్రిక నిర్వహిస్తున్న ఈ స్పెల్‌బీ పరీక్షల్లో పాల్గొనడంతో పోటీ పరీక్షలంటే భయం పోయింది.

–జీ.జ్యోత్స్న, 4వ తరగతి, వికాస్‌ గ్రామర్‌ స్కూల్‌